మూ॥ కాచిదమూల్యా చమ్పకమాలా
వృత్తనిబద్ధా మఞ్జులమాలా
అస్తుగణేశ స్యేశ్వర కాన్తా
కణ్ఠవిలోలా చమ్పకమాలా॥ 25

గణపతికి సంబంధించినదియు, అనిర్వచనీయమును, అగుచు చంపకమాలా వృత్తరచితమును, అమూల్యము అగు మంజులమాలను, (మృదుమధుర పదార్థ గుంఫితమగు పద్య పంక్తి, లేక కోమలమగు పూల దండ) చంపకమాలయై, ఈశ్వరకాంత యొక్క కంఠమున విశేషముగా చలించుఁగాత!

**ప్రభ:-** నా యీ స్తుతి – యీశ్వరీకంఠమున చంపక పుష్పమాలగా నొనర్పబడుఁగాతమని యర్థము. అమూల్య, మంజులమాలలు – శ్లిష్టములగు విశేషణములు ''కంఠమున విశేషముగా చలించుగాత!'' అనుచోట లక్షణచేత కంఠమునకు నాదమునర్థముగాఁ జెప్పు నెడల ''భగవతీ కంఠ ధ్వనియందు నాకృతి ప్రచలితమగు గాత'' అనుభావమేర్పడును. ''కంఠోవాచకశబ్దేస్యాత్ సన్నిధానే గలేధ్వనౌ'' అని నానార్థరత్నమాల – చెప్పుచున్నది. ఏకాంతభక్తుఁడను, పుత్రుఁడను, అగు నాచేత రచితమగు నీస్తుతి నాలించి యాదేవి కూడ – ఈ నా పుత్రుఁడు– అమూల్య రమణీయమగు స్తుతిని నిబంధించెనని తానుగూడ దీనిని సూక్ష్మముగా పలుకుచుండును గాత! ఇచట– ఉపమానమగు చంపక పుష్పమాల, ప్రకృతమునందుపయోగించి, విషయమగు చంపక మాలాస్తుతి రూపమున పరిణమించుట వలన ఇది – శ్లేషోత్థాపితమగు పరిణామాలం కారమగుచున్నది.

ఇది – సవ్యాఖ్యమగు పదునేడవ స్తబకము.

****



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (పంచమ శతకము – ద్వితీయ స్తబకము)

## అష్టాదశస్తబకము

**అవ:-** పదునెనిమిదవది యగు నీ స్తబకమున దేవీరూపము నభివర్ణించి పిండాండము నందు దాని తత్త్వము నుగ్గడించుచున్నాఁడు.

మూ॥ ధున్వన్త్వస్తిమిరతతిం హరి త్తటీనాం
ధిన్వన్త్వః పురమథనస్యలోచనాని।
స్కన్దామ్బాహసితరుచో హరన్తుమోహం
సాన్ద్రం మేహృదయగతం ప్రసహ్యసద్యః॥ 1

దిక్ ప్రదేశములయందున్న తిమిర విస్తృతిని తొలగించునవియు, రుద్రుని నేత్రత్రయమును సంతోషింపఁజేయునవియు, అగు సుబ్రహ్మణ్య జననీ మందస్మిత ప్రభలు – మదీయ హృదయ గతమును, సాంద్రమును, అగు మోహమును వెంటనే బలాత్కరించి తొలఁగించుఁగాత!

**ప్రభ:-** జ్ఞానప్రదుఁడగు సుబ్రహ్మణ్యుని జననియగు పరమేశ్వరి యొక్క మందస్మిత ప్రభలు – హృదయగతమగు మూలా జ్ఞానమును తొలఁగించుఁగాతమని ప్రార్థింపఁబడినది. కావున హృదయస్థిత– తమోఽ పహరణము కొఱకు స్కందాంబ – (సుబ్రహ్మణ్య జనని) అని చెప్పుట– రమణీయమగు నౌచిత్యమును సంఘటించుచున్నది.

మూ॥ తన్వానా వినతహితం విరోధివర్గం
ధున్వానా బుధజన మోదమాదధానా
స(మ్రాజ్ఞీ త్రిదివ ధరా రసాతలానాం
రు(ద్రాణీ భణతుశివాని మత్ కులస్య. 2

ప్రణతులకు హితము నొనర్చునదియు, విరోధివర్గమును కంపింపఁజేయునదియు, విద్వజ్జనమున కానందమును గలిగించునదియు, స్వర్లోక – భూలోక – పాతాళ లోకములకు సమ్రాజ్ఞియు అగు రుద్రాణి– మా వంశమునకు మంగళము నను(గ్రహించుఁగాత!

**ప్రభ**:- ప్రణతులు – వినతులు, హితము = శ్రేయము, విరోధివర్గము = శత్రు సముదాయము, సమ్రాజ్ఞి = చక్రవర్తిని.

మూ॥ యో౽మ్బ! త్వాంహృది విదధత్ తటిత్ ప్రకాశామ్
పీయూషద్యుతి మదహృన్ముఖార విన్దామ్।
అన్యత్తుస్మృతి పథతోధునోతిసర్వమ్
కామారేః సుదతి! నతస్య భువ్యసాధ్యమ్॥ 3

అమ్మా! కామారి సుందరీ! నిన్ను మెఱపువంటి కాంతి గల దానినిగాను, అమృతాంశుని మదమును హరించు ముఖారవిందముగల దానినిగాను, హృదయమునందు – ఆకళించి (ప్రవేశింపఁజేసి) ఇతరమునంతను స్మృతి పథమునుండి దూరీకరించువానికి భూలోకమున సాధింపరానిది లేదు.

**ప్రభ**:- మీఁదఁ దెలుఁపబడిన పరమేశ్వరీ స్వరూపమును హృదయమున హత్తించి – తదితర ప్రపంచ విస్మృతి నొందిన ధ్యాతకు సర్వమును శక్యమగునని భావము.



మూ॥ కాలాభ్రద్యుతి మసమానవీర్యసారాం
శక్త్యూర్మిభ్రమకర శుక్లఘోరదంష్ట్రామ్।
యోధీరోమనసిదధాతి భర్గపత్ని!
త్వామస్య ప్రభవతి సఙ్గరేషుశస్త్రమ్॥ 4

భర్గపత్నివగు జననీ! నిన్ను కాల (నీల) మేఘప్రభనుగాను, అద్వితీయ పరాక్రమ సారనుగాను, శక్తితరంగ – భ్రమకర – శుక్ల ఘోర దంష్ట్రనుగాను, మనస్సునందు ధారణమొనర్చుచుండు ధ్యాతకు తాను ధరించిన శస్త్రము యుద్ధములందు విజయసమర్థమగును.

**ప్రభ**:- ప్రభావ్యాఖ్యాతల చేత– ''శక్తి తరంగ భ్రమకర శుక్ల ఘోరదంష్ట్రను'' అను పదమున కర్థద్వయము చెప్పఁబడినది. అర్థద్వయమునందును కూడ భ్రమశబ్దమునకు భ్రమణమే (తిరుగుటయే) అర్థముగాఁ జెప్పఁబడినది. అందు మొదటియర్థము శక్తుల తరంగముల యందగు భ్రమణములే యగు కాంతులు గల – ధవళకరాళదంతములు గలది. (అనఁగా స్వీయధవలక రాళ దంష్ట్రాంశువు లే శక్తి తరంగ భ్రమణములని భావము.) రెండవయర్థము. శక్తి తరంగములందు భ్రమించుచున్న ధవలక రాళదంష్ట్రములు గలది. (అనఁగా; ''స్వీయధవళ భీషణదంష్ట్రల చేత శక్తి తరంగముల యందు భ్రమ నొనర్చునది'' అనిభావము)

మూ॥ యఃప్రాజ్ఞః, తరుణదివాకరోజ్జ్వలాఙ్గీం
తన్వఙ్గి! త్రిపురజితో విచిన్తయేత్ త్వామ్
తస్యాజ్ఞాం దధతి శిరస్సు ఫుల్లజాజీ
మాలాంవా ధరణి జుషోభవన్తః॥ 5

త్రిపురజిత్ సుందరీ! దేవీ! నిన్ను – 'బాల సూర్యుని వలె ఉజ్జ్వలమగు శరీరము గలదానినిగా ధ్యానించువానికి, భూలోక నివాసులందఱును గూడ వశపడి,

వానియా దేశమును, వికసించిన జాజీపుష్ప మాలను వలె శిరస్సులయందు ధరించుచుందురు.

**ప్రభ:-** ఎవఁడు నిన్ను బాలసూర్య సన్నిభగా నుపాసించునో వాని యెడల ప్రీతివహించి, తదధీనులై, మానవులు – వానియాజ్ఞనను సరింతురని భావము.

మూ॥ యోరాకాశశధర కాన్తి సారశుభ్రాం
బిభ్రాణాం కరకమలేన పుస్తకంత్వామ్।
భూతేశం ప్రభు మసకృత్ ప్రబోధయ న్తీం
ధ్యాయేద్ వాగ్ భవతి వశేఽస్యనాకదూతీ॥ 6

దేవీ! భగవతివగు నిన్ను పూర్ణిమా చంద్రకాంతి సారమగు నమృతమువలె తెల్లనిదగు పుస్తకమును కరకలమున ధరించుచున్న దానినిగాను, ప్రభువగు పశుపతిని మాటిమాటికిని మేల్కొలుపుచున్న దానినిగాను, ధ్యానించు పురుషునికి వశపడి (వాక్కు) సరస్వతి–నాక దూతియగును.

**ప్రభ:-**నిత్య సమాధి నిష్ఠుఁడగు భగవంతుఁడు; పరమేశ్వరునకు–జగద్విషయకమగు ప్రబోధమును గలుగఁజేయుటకు నిత్యమును ప్రయత్నించుచున్న దానినిగాను, ప్రసన్న ధవల పుస్తకహస్తను గాను, నిన్ను పాసించు పురుషుఁడు – అమోఘ వాగ్ వీర్యుఁడై, తన వాక్కును దేవతలు గూడ వినునట్లొనర్పఁగలుగునని భావము.

మూ॥ జానీమో భగవతి! భక్త చిత్తవృత్తే
స్తుల్యం త్వం సపది దధాసి రూపమగ్ర్యమ్।
ప్రశ్నోఽయం భవతి నగాధినాధకన్యే।
రూపం తే మదయతి కీదృశం స్మరారిమ్॥ 7



భగవతీ! భక్తుని మనోవృత్తి రూపమగు ప్రశస్తరూపమును వెంటనే ధరింతువను నంశమును మేమెఱుఁగుదుము. ఇది యొక ప్రశ్న. పార్వతీ! నీకు సంబంధించిన కీదృశమగు రూపము – స్మరరిపుని మోహింపఁజేయుచుండును?

**ప్రభ:-** నీవు స్వేచ్ఛ చేత వివిధములగు రూపములను ధరించుటకు శక్తురాలవని మాకు తెలియును. కాని మదనారిని వశీకరించు కొనుటకే రూపమును ధరించెదవో చెప్పుము.

మూ॥ చారుస్యా దల మితి వక్తు మమ్బ! శక్యం
రూపం తే వదతి కోఽపి కీదృశం వా
సమ్మోహం పరముపయాన్తి కాన్తిభాణ్డే
కామారే రపి నయనాని యత్రదృష్టే॥ 8

అమ్మా! మదనారియగు శివుని మోహింపఁజేయుటకు – ఎంత సుందరమగు రూపము సరిపడునో (చాలునో) అంత సుందరమగు రూపము (ధరించెదవని) చెప్పుట సులభమే. కాంతి భాండమగు – ఏనీ రూపము చూడఁబడినపుడు – కామారి యొక్క నయనములు మూడును గూడ సమ్మోహము నొందినవో, ఆ నీరూపము – ఎట్టిదో, (నరుఁడుగాని యమరుఁడు గాని) ఎవ్వఁడునుగూడ చెప్పకున్నాఁడు.

మూ॥ సఙ్కల్పైః కిము తవ భూషణాన్యభూవ
శ్ఛిల్పీన్ద్రాః కిము విదధుర్యథాఽ త్రలోకే।
తత్ స్వర్ణం భగవతి। కీదృశం మణీనాం
కిం రూపం భవతిచ తత్రయోజితానామ్॥ 9

భగవతీ! నీ సంకల్ప బలము చేతనే నీకు – భూషణములు ప్రాదుర్భవించినవా? ఈ లోకమునందు వలెనే కలాకుశలులగు శిల్పీంద్రులు (స్వర్ణకారులు) నీయాభరణములను సంఘటించిరా? ఏ బంగారముతో నీ

భూషణములు చేయఁబడినవో ఆ బంగారమెట్టిది? ఆ భూషణముల యందు ఖచితములగు రత్నముల స్వరూపమేమి?

మూ॥ యాన్యఙ్గాన్యఖిల మనోజ్ఞసారభూతా
స్యే తాషామపి కిము భూషణై రుమే! తే।
అహోస్విల్లలితతమాని భాన్తిభూయో
భూషాభిర్వికృతతమాభిరప్యమూని॥ 10

ఉమా! ఏ నీయంగములు – సకల రమణీయవస్తు సారభూతములో అయి యంగముల భూషణములచే నగు ప్రయోజన మేమున్నది? ఒకవేళ, నిసర్గ రమణీయములగు నేయంగములు – వికృతతమములగు భూషణముల చేతను గూడ లలితతమములై విశేషించి భాసించును కాఁబోలు.

**ప్రభ:-** సుందరతమములగు నీయంగములకు భూషణముల చేతఁ గలుగు నుత్కర్షమున కవకాశము లేదు. ఈ భూషణములు కృతకములు. కావున మిక్కిలి వికృతములు. వీనికంటె నీయంగములు మిక్కిలి కోమలములు. కావున కృతకమగు రామణీయకము గల భూషణముల చేత నైసర్గిక రామణీయకము గల నీయంగములు సుందర తమములై స్పష్టముగా ప్రకాశించుచుండునని భావము.

మూ॥ ముక్తాభిర్భవతి తవామ్బ! కిన్నుహారః
పీయూషద్యుతికరసారనిర్మలాభిః
ముణ్డైర్వాఘలఘల శబ్ద మాదధద్భిః
సజ్జీర్వాత్ త్రిభువన సార్వభౌమభామే॥ 11

అమ్మా! త్రిభువన సార్వభౌమభామా! నీహారము– అమృతాంశు కిరణసారమగు తుషారము వలె స్వచ్ఛములగు ముక్తామణుల చేతఁ గూర్పఁబడినదా? లేక అన్యోన్యమగు తీవ్రఘర్షణము వలన ఘల ఘలాయమానమగు శబ్దము నొనర్చుచున్న ముండముల చేతఁ (నరకళేబరముల చేత) రచింపఁబడినదా?



**ప్రభ:-** దక్షిణ కాళీమూర్తి, ముండమాలాధారిణి యనునంశము– (తల పుఱ్ఱెల దండలను ధరించినదని) తంత్రశాస్త్ర ప్రసిద్ధమగుచున్నది.

మూ॥ వస్త్రంస్యాద్యది తవ సర్వశాస్త్రగమ్యే!
కార్పాసం దివిచ తదుద్భవోఽనుమేయః॥
క్షౌమంచేద్ భగవతి! తస్య హేతుభూతాః
కీటాః స్యుర్గగనజగత్యపీతి వాచ్యమ్॥ 12

నిగమాగమాది శాస్త్రగమ్యవగు జననీ! నీవస్త్రము – కార్పాసము (కార్పాసీఫలతంతు నిర్మితము అనఁగా ప్రత్తి నుండి తీయఁబడిన దారముతో నేయఁబడినది) అగునెడల, ద్యులోకమునందుఁ గూడ ప్రత్తి నుండి తీయఁబడిన నూలుతో నేయఁబడిన వసనము యొక్క ఉత్పత్తి – అనుమానింపఁ (ఊహింపఁ) దగినది.

**ప్రభ:-** భగవతీ! అవస్త్రము – క్షౌమము, (కౌశేయము) అగు నెడల, అంతరిక్ష లోకమునందుఁగూడ దానికి హేతు భూతములగు కీటకములున్నవని చెప్పవలయును. పట్టుపురుగు చేత తయారు చేయఁబడిన దారముతో నేసిన చీర– 'క్షౌమము' అని చెప్పఁబడును.

మూ॥ రుద్రస్యప్రియ దయతేఽథవా సురద్రు
ర్భూషణాం మణికనక ప్రకల్పితానామ్
వస్త్రాణామపి మనసే పరం హితానాం
కామం తే భవతి సమర్పకః సమర్థః॥ 13

రుద్రప్రేయసివగు జననీ! ఒకవేళ – కల్పవృక్షము – మణికనక ప్రకల్పిత ములగు భూషణములను, మనోహరములగు వస్త్రములను మిక్కిలి సమర్థమై సమర్పించుచున్నదా?

**ప్రభ:-** కల్పవృక్షము – వస్త్రభూషణసమర్పణ నిపుణమగుచున్నదా? అని ప్రశ్నము చేయఁబడినది.

మూ॥ సుస్కన్ధో బహు విటపః ప్రవాలశోభీ
సమ్ఫుల్ల ప్రసవ సుగన్ధవాసితాశః
వృక్షః కిం భగవతి! కల్పనామకోఽయం
సఙ్కల్పః కిము తవకోఽపిదేవి! సత్యః॥ 14

భగవతీ! దేవీ! శోభనమగు స్కంధము గలదియు, బహులమగు వృక్షవిస్తారము గలదియు, ప్రవాలముల చేత శోభించునదియు, లెస్సగా వికసించిన పుష్పముల యొక్క సుగంధము చేత వ్యాపింపఁబడిన దిక్కులు గలదియు, కల్పనామకమగునదియునగు ఈ వృక్షము సత్యమా? లేక నీకు సంబంధించిన యొకానొక సంకల్పమా?

**ప్రభ:-** చక్కని బోదెతోఁగూడినదియు, అనేక వృక్షముల సముదాయ రూపమైనదియు, చిగుళ్ళచేత శోభించునదియు, వికసించిన పూవుల పరిమళమును దిక్కులందంతటను ప్రసరించునదియు, కల్పమను పేరుగలదియు, నగువృక్షము-ఉన్నదా? లేక యది నీ సంకల్పరూపమా? అని ప్రశ్నము చేయఁబడినది.

**అవ:- కామధేను- కల్పవృక్షములకు సంబంధించిన ఆధ్యాత్మతత్త్వమును దెల్పుచున్నాఁడు.**

మూ॥ సఙ్కల్పాన్నభవతి కల్ప పాదపోఽన్యః
స్వర్ధోగ్ధ్రీపునరిత రానకుణ్డలిన్యాః
యఃకుర్యాద్ ద్వయమిదముద్గతాత్మవీర్యం
కారుణ్యాత్తవభువిచాస్యనాక భాగ్యమ్॥ 15



అమ్మా! సర్వవస్తుప్రదమగు కల్పవృక్షము – సంకల్పముకంటె వేరుకాదు. కామధేనువు కూడ – కుండలి నీ శక్తికంటె నితరము కాదు. ఈ సంకల్ప – కుండలినీ శక్తులు రెండింటిని – ఉద్ గతమగు – ఆత్మవీర్యము గలవానినిగా నొనర్చువానికి, నీకారుణ్యము వలన భూలోకమునందే స్వర్గలోక భాగ్యము కలుగును.

**ప్రభ:-** ఉద్గతము = ప్రబుద్ధము = మేలుకొలుపఁబడినది. ఆత్మవీర్యము= స్వబలము.

మూ॥ ఆపీనం భవతి సహస్రపత్రకఞ్జం
వత్సోఽస్యాః పటుతరమూలకుణ్డవహ్నిః
దోగ్ధాఽత్మాదహరసరోరుహోపవిష్టో
మౌనం స్యాత్ సురసుర భేస్తనూషుదోహః॥ 16

సహస్రారకమలమే – పాలపొదుగు. కుండలినియగు కామధేనువునకు– మూలాధారమేయగు కులకుండమునందలి నిపుణతరమగు నగ్నియే – దూడ హృదయ కమలాసీనుఁడగు ఆత్మయే – దోగ్ధ. (పాలు పితుకువాఁడు) సర్వవిషయములను నిరసించునదియు, శాంతితో నిండియుండునదియునగు మౌనమే – పొదుగునుండి పాలుతీయుట.

**ప్రభ:-** కుండలి నుండి జనించిన మూలాగ్నియే వత్సము. (దూడ).

మూ॥ దోగ్ధ్యాస్తే భగవతి! దోహనేన లబ్ధం
వత్సాగ్ని ప్రథమ నిపాన సద్రవాయాః।
దుగ్ధం స్వాద్వమృతమయం పిబన్మహాత్మా
సన్తృప్తోనభవతి దుర్భరోఽస్యకుక్షిః॥ 17

దూడయను మూలకుండాగ్ని యొక్క ప్రథమ నిపానము చేత చేపఁబడిన పాలుగల కామధేనువును పితుకుట చేత లభించిన క్షీరమను మధురామృతమును

త్రాగుచున్న నాయాత్మ (అనఁగా జీవాత్మ) సంతృప్తుఁడు కాకున్నాఁడు. వీని కుక్షినింపుట - కష్టము.

**ప్రభ:-** మూలాధారమను పేరుగల కులకుండాగ్ని యగు వత్సము - కుండలినీ శక్తియగు కామధేనువునుండి జన్మించినది. ఆవత్సము - తల్లియొక్క పొదుగునందలి పాలను మొదట కుడువఁగా నామె చేపుచుండును. ఆ దూడ మొదట త్రాగఁగా నురుగుతోఁ గూడిన పాలుగల యాధేనువును మరల పిదికి, (సహస్రారమను) పాల పొదుగు నుండి తీసిన (అమృతమను) క్షీరములను - ఈ జీవాత్ముఁడు త్రాగుచున్నాడు, లభించిన యీపాలతో సంతృప్తి నొందకున్నాఁడు. (ఇంతవఱకు త్రాగితిని గదా! చాలునని సంతుష్టి నొందకున్నాఁడు) దీనకి హేతువే మనిన; ఈ జీవాత్ముని కుక్షి - నింపుట శక్యము కానిదని, తిండిపోతునకు స్వల్పమగు భోజనము చాలదు - అని భావము.

మూ॥ వత్సోऽగ్నిః పిబతి దృఢాఙ్ఘ్రిరమ్బ! పశ్చాత్
అశ్రాన్తం పిబతి దుహన్ పురోऽన్తరాత్మా
వృద్ధించ వ్రజతి పయః ప్రతిప్రదోహం
దోగ్ధ్ర్యాస్తే ద్రవ ఇహ కుణ్డలిన్యపారః॥ 18

వత్సమగు అగ్ని, వెనుకకు - ముందుకు, స్ఖలితముకాని దృఢమగు పదప్రక్షేపము గలదై పాలను త్రాగుచున్నది. పురోభాగము నదంతరాత్మ - దోహనము నొనర్చుచు (పాలు పితుకుచు) విశ్రాంతి కలుగకుండ త్రాగుచున్నాఁడు. ప్రతి ప్రదోహమునందును (పాలు పితుకుచున్న సమయములయందెల్లను) పాలు వృద్ధినొందుచున్నవి. (అయినను) ఓ కుండలినీ దేవీ! కామధేనువవగు నీ క్షీర రసము అపారమైయున్నది.

**ప్రభ:-** మూలాధారమునందలి కుండాగ్ని - అ స్ఖలితమగు స్థితి గలిగి పీల్చుచున్నను, జీవాత్మ - యాస్వాదించుచున్నను గూడ సహస్రారము నుండి జనించుచున్న యమృతరసము క్షీణింపక వృద్ధినే పొందుచున్నది. కావున కుండలిని వలన ప్రసరింపఁబడుచున్న సోమరసము - అమితమని భావము.

మూ॥ సోమస్య ద్రవమిమ మాహురమ్బ! కేచిత్
దుగ్ధాబ్ధేరమృతరసం గదన్తికేऽపి
బాష్పం కేऽప్యభిదధతే తు కౌలకుణ్డం
పీనోధస్స్రవమితరే భణన్తి ధేనోః॥ 19

అమ్మా! ఈ రసమును కొందఱు సోమద్రవమని (సోమలతయందలి రసమని, లేక చంద్రకిరణావృతమని) చెప్పుదురు. కొందఱు పాలసముద్రమునందలి అమృతరసమని చెప్పుదురు. మఱికొందఱు మాత్రము - మూలాగ్ని కుండమునకు సంబంధించిన బాష్పమని (ఆవిరియని) చెప్పుదురు. వేరొక కొందఱు మాత్రము - కామధేనువు యొక్క బలసిన పొదుగునందలి పాలని చెప్పుదురు.

**ప్రభ:-** ఇట్లు బహువిధముల నుల్లేఖించుట వలన నిది - ఉల్లేఖాలంకారమగుచున్నది.

మూ॥ మూలేత్వం జ్వలదలన ప్రకాశరూపా,
వీణాయాం ప్రబలమహోమదోస్మరూపా,
శీర్షాబ్జే సతతగలద్ రసస్వరూపా,
భ్రూమధ్యే భవసిలసత్ తటిత్ స్వరూపా. 20

అమ్మా! నీవు మూలాధారమున, మండుచున్న అగ్ని యొక్క ప్రకాశమే రూపముగాఁగల దానవు. వీణారూపమగు అస్థిదండమున - ప్రబలమగు మహోమదము యొక్క ఊష్మ రూపముగాఁ గలదానవు. శీర్షకమలమున (సహస్రారమున) సంతతమును జారుచున్న సోమరసము - స్వరూపముగాఁగలదానవు. భ్రూమధ్యమున (ఆజ్ఞాచక్రమున) ప్రకాశించుచున్న మెరుపు - స్వరూపముగాఁగలదానవు.

మూ॥ హార్దేచే దవతరసీహ పుణ్డరీకే
ఛాయావత్ సకలమపి ప్రపశ్యసిత్వమ్
ఆరూఢా దశశతపత్ర మద్రిపుత్రి!
స్వాశ్చేత్ త్వం భణసి జగత్ సుధాసముద్రమ్॥ 21

అద్రికుమారీ! ఈ హృదయ కమలమున నవతరించునపుడు నీవీ సకలమును గూడఛాయను (నీడను) వలె సమీక్షింతువు. దశశతప్రతము (సహస్రారము) నందారూఢవగునపుడు విశ్వమును సుధాసముద్రముగాఁ జెప్పుదువు.

**ప్రభ:-** ఆత్మయే – సర్వాత్మకము. కావున హృదయ స్థితుఁడగు నాత్మకు తదితరమంతయుఁగూడ ఛాయామయమగును. సహస్రారమునందున్న యాత్మ-జగత్తునంతను, అమృతాత్మకముగా ననుభవించును. కావుననపుడాత్మకి విశ్వమంతయుఁగూడ అమృతమయమగును.

మూ॥ నేత్రాభ్యాం సరసిరుహచ్ఛదాయతాభ్యాం
వక్త్రేణ ప్రవిమలహాస భాసురేణ।
ప్రత్యక్షా మమమనసః పురః పురస్త్రీ
కామారేః పరిణతమస్మదీయ భాగ్యమ్. 22

శివప్రేయసియగు దేవి– సరసిరుహదళాయతములగు నేత్రముల తోడను, ప్రవిమలహాస భాసురమగు ముఖముతోడను, నా మనస్సు నెదుట సాక్షాత్కరించినది. నా భ్యాగము ఫలించినది.

**ప్రభ:-** ప్రసన్న యగుదేవి, ప్రత్యక్షమయినది. నేనొనర్చిన పుణ్యమునకు ప్రసన్నయగు దేవియొక్క దర్శనము కంటె మహత్తరమగు ఫలమేమున్నదని భావము.



మూ॥ పుణ్యానాం పరిణతి రేవభూతభర్తుః
సిద్ధానాం బలనిధి రేవకోఽపిగూఢః।
భక్తానాం దృఢతరి రేవ శోకసిన్ధౌ
మగ్నానాం మమజననీ మహీధ్రపుత్రీ. 23

నా జననియగు మహీధరపుత్రి – భూతేశ్వరుఁడగు శివునికి సుకృతపరిణతియే– (పరమేశ్వరతపస్సంపత్ ఫలమే) దేవయోని విశేషులగు సిద్ధులకు – గూఢమగు నొకానొకబలనిధియే, శోకసముద్రమున మగ్నులగు భక్తులకు – దృఢనౌకయే.

**ప్రభ:-** ఒక్కతె యగు పార్వతి – పరమేశ్వరతపః పరిపాకముగాను, సిద్ధులకు – అణిమాదులగు – అష్టైశ్వర్యముల నొసఁగు అనిర్వచనీయమును గుప్తమును అగు బలనిక్షేపముగాను, శోకసాగరమున మునిఁగిన భక్తులకు – అస్ఖలితమగు గతియగు, ఓడగాను, ఉల్లేఖింపఁబడినది. కావున నిది ఉల్లేఖాలంకారమగుచున్నది. పుణ్యపరిణతి – బలనిధి దృఢనౌకలు – పార్వతీరూపములుగా రూపింపఁబడుట వలన తాద్రూప్యరూపకముగూడ నగుచున్నది. ఈ రూపకము చేతనే ఉల్లేఖము – ఉత్థాపితము. కావున రూపకమంగమును ఉల్లేఖము –అంగియునగుచున్నది. కావున నిది అంగాంగి భావముచే నేర్పడిన సంకరాలంకారమగునని తెలియునది.

మూ॥ ఉద్ధర్తుం వినతజనం విషాదగర్తాత్
సంస్కర్తుం భువనహితాయ యోగయుక్తమ్
సంహర్తుం ఖలకులముద్ధతంచ దర్పాత్
భర్గస్య ప్రియతరుణీ సదాసదీక్షా॥ 24

భర్గప్రియతరుణియగు దేవి – ప్రణతుఁడగు భక్తజనుని విషాదమను గర్తము నుండి ఉద్ధరించుటకును, యోగనిష్ఠాయుక్తుఁడగు జనుని లోకశ్రేయము కొఱకు

సంస్కరించుటకును, దర్పమువలన గర్వించిన దుర్జనకులమును, సంహరించుటకును, ఎల్లప్పుడును దీక్షతోఁ గూడినదై యున్నది.

ప్రభ:- గర్తము = నిమ్నస్థలము - గాత. ఉద్ధరించుటకు = బయటికి లాగుటకు, సంస్కరించుటకు = విశుద్ధుని చేయుటకు, సంహరించుటకు = ధ్వంసముచేయుటకుఁ దీక్షతో, గూడినది = వ్రతమును ధరించునది.

మూ॥ మృద్వీకాం మధురతయా సుధాంమహిమ్నా
గామ్భీర్యాత్ సురతటినీం చనిర్జయన్తీ
శర్వాణీచరితపరా ప్రహర్షిణీనాం
శ్రేణీయం జయతు గణేశ్వరేణబద్ధా॥ 25

మాధుర్యము చేత ద్రాక్షను, మహాత్మ్యము చేత, అమృతమును, గాంభీర్యము వలన దేవనదియగుగంగను, నిర్జించునదియు, శర్వాణియొక్క కథయే ప్రధానముగాఁ గలదియు, గణపతిచే నిబంధింపఁబడినదియు నగు ఈ ప్రహర్షిణీ వృత్తమాలిక - జయించుఁగాత!

ప్రభ:- ప్రహర్షిణీవృత్త మాలిక, ఇచట బహువిధములుగా నుల్లేఖింపఁబడుట వలన, నిది యుల్లేఖాలం కారమని తలపంఁదగదు. మాధుర్యాదుల చేత- ద్రాక్షాదులను నిర్జించునదియని ఉపమానసూచకమగు 'నిర్జించునది' అనుపదము యొక్క ప్రయోగము వలన ఒక వస్తువునకు - అనేకములగు నుపమానములు చెప్పఁబడుటవలన ఇది - అర్థియగు మాలోపమాలంకారమగునని తెలియునది.

ఇది సవ్యాఖ్యమగు పదునెనిమిదవ స్తబకము

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (పంచమ శతకము - తృతీయస్తబకము)

## ఏకోనవింశ స్తబకము

మూ॥ ప్రఫుల్ల కల్పపాదప ప్రసూన సద్యశోహరమ్
మహోరుజం ధునోతుతే మహేశసున్దరీ స్మితమ్॥ 1

వికసించిన కల్పతరు ప్రసూనము యొక్క 'సత్కీర్తిని హరించునదియగు మహేశ్వర సుందరియొక్క హసితము- మీ యొక్క మహా రోగమును (సంసారమను రోగమును) తొలఁగించుగాత!

ప్రభ:- అమరలోకజన్యమగుట వలన సర్వాభీప్సితప్రదమును, సర్వరోగ నివారణమును, స్పృహణీయదర్శనమును, అగు ప్రఫుల్ల కల్పవృక్ష కుసుమము యొక్క ఖ్యాతినిగాఢ హరించుచున్న మహేశ్వరీమంద స్మితము - రోగములన్నింటియందును గొప్పదగు భవరోగమును నశింపఁజేయునుగాతమని తాత్పర్యము.

మూ॥ మునీన్ద్రమూల వేదిభూధనఞ్జయ ప్రబోధనమ్।
యతీన్ద్రహార్దపేటిక కవాటబన్ధభేదనమ్॥ 2

మునీంద్రులయొక్క మూలాధారమేయగు వేదిభూమి (పరిష్కృతమగు భూమి) యందలి యగ్నిని ప్రబోధించునదియు యతీంద్రుల హృదయమను పేటిక యొక్క కవాటమును (తలుపు) తెఱచునదియు.